"అదిగో! అక్కడుంది" తేజా వేలెట్టి చూపాడు.

"నువ్వు తీసుకో కార్తీకా!"

"నాకు వద్దు పిన్నీ" ఆమె మాటల్లో కరుకుదనం వుంది.

చేతిలో ఐస్ కరిగిపోవడం ప్రారంభించటంతో, ఏంచెయ్యాలో తోచక తానుగా కార్తీక వున్నవైపుకి వెళ్ళాడు.

ఆమె ఇదేమి పట్టించుకోలేదు. బ్యారేజివైపు చూస్తూ నించుంది.

"హల్లో! ఇఫ్యూ డోన్ట్ మైండ్ ప్లీజ్ టేక్ యిట్" తీసుకోమని అభ్యర్థించాడు. కార్తీక హరీష్ వంక చూసి తీసుకుంది.

"థ్యాంక్స్!"

"దేనికి?"

"మీరు తీసుకున్నందుకు."

ఆమె దగ్గర్నుంచి లాయర్‌గారి భార్య కూర్చున్న దగ్గరకు వచ్చాడు.

నువ్వు అప్పుడప్పుడు ఇంటికి వస్తుండు. ఈయనగారి దగ్గర చాలామంది జూనియర్స్ పనిచేశారుగానీ వాళ్ళెవరూ మా కుటుంబంలో కలవలేదు. నిన్ను మా కుటుంబంలో ఒకడిగా చేసుకుందామనుకున్నాం. కానీ అది ప్రాప్తం వున్నట్లు లేదు.

ఆమె ఏ విషయం గురించి మాట్లాడిందో హరీష్‌కి అర్థం అయింది.

ఆమె ఆ సంభాషణ ప్రస్తావించినపుడు కార్తీక వున్నవైపు చూశాడు హరీష్. కార్తీక అక్కడలేదు. జాలర్లు వలవేస్తుంటే ముందుకువెళ్ళి చూస్తూ వుంది.

"కార్తీకకు ఏమైనా సంబంధాలు చూస్తున్నారా?"

రెండు సంబంధాలు వచ్చాయి. ఫోటోలు పంపారు. ఏదీ నచ్చలేదండి. వాళ్ళందరికి ఇది నచ్చింది. పదిరోజులలో ఆ సంబంధం చేసుకుతీరాలని పట్టుబట్టాడు. ఇదేమో వాళ్ళ బాబాయి దగ్గరకి వెళ్ళి కళ్ళనీళ్ళు పెట్టుకుంది అంటూ "పిల్లలెక్కడ" అని అటూ ఇటూ చూసింది.

అందరూ తలో చోట వున్నారు.

లోగొంతుకతో మాట్లాడుతూ "హరీష్‌ని తప్ప ఎవ్వరినీ చేసుకోనుచిన్నాన్నా! అతను చేసుకోనంటే సరి లేకుంటే యం.ఎస్‌సి. రిసర్చిచేసి స్టేట్స్‌కి వెళ్ళిపోతానని చెప్పింది.

ఆమె మాటలు విన్న హరీష్ ఒక్కసారిగా షాక్ అయి కార్తీకవైపు చూశాడు. ఆమె యిటు చూడ్డంలేదు.

(సశేషం)



# అన్నపూర్ణ

ప్రకాశం యింటికి రాలేదు. రాత్రి ఎనిమిదయినా....అన్నపూర్ణ ఆత్రంగా కొడుకు రాకకోసం వేచివుంది.... సాయంత్రం చేసిన వేడి జున్ను అప్పటికే చల్లారిపోయింది. ఆవుపాల జున్ను ప్రకాశానికి అమితమైన యిష్టం.... అన్నపూర్ణ కళ్ళ వెలుగు ప్రకాశం. యాభైయేళ్ళ వయస్సూ, లాయరుగా మంచిపేరూ, సంపాదనగల రంగనాధరావు రెండవ భార్యగా అన్నపూర్ణ కాపురానికొచ్చింది. యాభైయేళ్ళ భర్త లభించడం ఆమె అదృష్టమేనని భావించారు తలితండ్రులు....కారణం ఎదిగి ఉన్న కూతురికి ఎన్నాళ్ళకీ సంబంధం కలిసి రాకపోవడం, వచ్చిన సంబంధాలు కట్నంకోసం మళ్ళిపోవడం.... జీవితంపట్ల నైరాశ్యం ఆవరించి ఉన్న రోజుల్లో అన్నపూర్ణ తల్లిగా మారింది. అంతే! నాటినుండి ఆమె భర్తమీద, అపురూపమైన ప్రకాశం మీద మమకారం పెంచుకుంది....అయితే ఆమె ఆనందాన్ని కళ్ళారా చూడలేని దేవుడు ఆమెకి భర్తని దూరం చేసాడు.... కృంగిపోలేదామె. ప్రకాశాన్ని పట్టిబట్టి చదివించి వృద్ధిలోకి తెచ్చింది.... బేంక్ ఆఫీసర్‌గా పని చేస్తున్న కొడుకుని చిన్న పిల్లాడిలానే భావిస్తుందామె.

నిత్యం వేళకి యింటికి తిరిగి వచ్చే ప్రకాశం ఆ రోజు ఆలస్యం చెయ్యడానికి గల కారణం ప్రసూన. అతని బేంక్‌లోనే ఉద్యోగం చేస్తోంది.... పేరున్న చిత్రకారుడు తీరిగ్గా కూర్చుని గీసిన రంగుల చిత్రంలా ఉంటుంది ప్రసూన....వయస్సుతో పాటు పెరిగిన అందచందాలు ఆమెది....యువకుల కళ్ళకి ఆమె అప్పుడే విడిన రోజా పువ్వు. ఆమె సంస్కారం, నడత నీటుగా, ధీటుగా ఉంటాయి. ఎవరినీ నొప్పించని ఆమె తత్వం ప్రకాశానికి నచ్చింది....అతనామె ఆకర్షణకు లోనయ్యాడు. ఆమె సుందర రూపం అతని కళ్ళల్లో నిలచి, కలల్లో కనిపించేది. స్నేహం. యిద్దరి మధ్యా నాంది వాచకం పలికింది. ప్రేమ బీజంలా అంకురించింది,

తన పుట్టిన రోజని యింటికి ఆహ్వానించింది ప్రసూన.. కానుకగా ఓ మంచి చీర పాక్ చేయించి పట్టుకు

వెళ్ళాడు ప్రకాశం....అతని రాకకోసం ఎదురు చూస్తున్నాడు విశ్వనాథం.... ప్రసూన తండ్రి....తండ్రిని పరిచయం చేసింది ప్రసూన. ఆమె కళ్ళ జ్యోతుల్లా మెరుస్తున్నాయి.

మాటలు మొదలయ్యాయి....అజంట అలా నవ్వుతూ మాట్లాడుకుంటూండే ఓ శ్రోతగా మిగిలాడు విశ్వనాథం.... అతనొకప్పుడు సర్కారు గుమస్తాగా




పనిచేసి రిటయిరయిననాటికి అసిస్టెంట్ ఆఫీసర్ కాగలిగేడు.... పెద్దవాళ్ళయిన యిద్దరు మొగ పిల్లలు తనని ఉద్ధరిస్తారనుకొని పెద్ద చదువులు చదివించాడు. అయితే వాళ్ల అతని అంచనాని తారుమారు చేసి, ఉద్యోగాలు రాగానే ఎవరి మానాన్న వాళ్ల పెళ్ళిళ్ళు చేసుకుని, వేరే వెళ్ళిపోయారు. పది రోజులు పాటన్నా వారింట వుండి వద్దామని వెడితే....అతన్నొక చుట్టాన్ని చూసినట్టు చూస్తారు కోడళ్ళు....కొడుకులు ముఖావంగా మాట్లాడతారు. తమకి పెళ్ళి కెదిగిన చెల్లెలు ఉందన్న తలంపు రాదు వారికి. తన సర్వీసులో పైసా మిగల్చకుండా, అప్పులు చేసి వారిని పెంచినందుకు వారు చూపించే ప్రేమ అంతగరళంగా ఉంటుందనుకోలేదు విశ్వనాథం....సరిగ్గా అదే సమయానికి స్వశక్తితో బేంక్ ఉద్యోగిని కాగలిగింది ప్రసూన....

"ప్రసూనని ప్రకాశం పెళ్ళి చేసుకుంటే బాగుండును...."అనుకున్నాడు విశ్వనాథం మనస్సులో...."అయితే కట్నకానుకలు యిచ్చుకునే స్థితిలో తనులేడు...."సందేహం మొదలయింది.

గంటకు పైగా కాలక్షేపం చేసి యింటికి బయలు దేరాడు ప్రకాశం. అప్పుడు సరిగ్గా తన ఉద్దేశ్యం వ్యక్తం చేసాడు విశ్వనాథం. కూతురి పెళ్ళి ప్రస్తావన తెచ్చాడు.

"అంతా మా అమ్మగారిష్టం....మీరు వచ్చి కలియండి"అన్నాడు ప్రకాశం.

"ఎల్లుండి ఆదివారం ఉదయం వస్తాను...." ఎడ్రస్సు తెలుసుకుంటూ అన్నాడు విశ్వనాథం,

"అలానే...."గుడ్ నైట్ చెప్పి స్కూటర్ ఇంటి త్రోవ పట్టించాడు ప్రకాశం....

ఆలస్యంగా యింటికి వచ్చిన ప్రకాశాన్ని ఏమని ప్రశ్నించలేదు అన్నపూర్ణ....ఉత్సాహంగా ఉన్న కొడుకు అంతరంగాన్ని అంచనా వెయ్యగల శక్తిలేనిది కాదామె....వయసు చెడ్డది. వాడెటువంటి తప్పటడుగు వెయ్యరాదన్నది మాత్రమే ఆమె కోరిక.

తల్లికి ప్రసూన విషయం ఎలా చెప్పడమని సందిగ్ధంలో పడ్డాడు ప్రకాశం....తల్లి అందించిన జున్ను ప్లేటు అందుకుని మౌనంగా తినసాగాడు.

"ఎలా ఉంది బాబూ?...."

"ఎంతో బావుంది...."


"వేగిరం నువ్వింటికి వచ్చివుంటే వేడిమీద మరింత బావుండేది ..."

"అవునమ్మా అనుకోని ఆలస్యం జరిగింది...." అంతకన్నా మంచి అవకాశం రాదని ప్రసూన విషయం క్లుప్తంగా చెప్పాడు ప్రకాశం. అప్పటికే అన్నపూర్ణలో సంక్షోభం మొదలయింది.... ప్రకాశం అప్పుడే పెద్దవాడయ్యాడు.... స్వతహాగా నిర్ణయం తీసుకునే స్థితికి వచ్చాడు.

"ఆదివారంనాడు వాళ్ళ నాన్నగారు మనింటికి వస్తారమ్మా...."

"ఎందుకుబాబూ.... నీ నిర్ణయాన్ని ముందే తెలియజేసావు కదా?" కించపడిందామె.

"ఆహా: ఎంతమాత్రం కాదు. నీదే




తుది నిర్ణయం...." సంభాషణ అక్కడికి ఆగిపోయింది.

ఆదివారం రానే వచ్చింది....అన్న సమయానికి అయిదు నిమిషాలు ముందుగానే విశ్వనాథం వచ్చాడు.

"మీ అమ్మగారేరి?" సోఫాలో కూర్చుంటూ ప్రశ్నించాడు విశ్వనాథం. సమాధానంగా అన్నపూర్ణ వంటగదిలో నుండి కాఫీ కప్పులతో వచ్చింది. కప్పుల్ని టీపాయ్‌మీద వుంచుతూ దర్పంగా కూర్చుందామె వారి కెదురుగా.... నమస్కరిస్తున్న విశ్వనాథం దృష్టి ఆమెపై పడింది.... ప్రతి నమస్కారం చేస్తున్న అన్నపూర్ణ కళ్ళు అప్పుడే అతన్ని చదివేస్తున్నాయి.... గతం యిద్దరిలోనూ ఒకేమారు తొంగి చూసింది.

* * *

పాతికేళ్ళక్రితం.... ఆ రోజు కూడా సరిగ్గా ఆదివారమే....అన్నపూర్ణయింటి ముందు జట్కా ఆగింది.... ఇంటికి వచ్చిన అతిథుల్ని ఆహ్వానించడానికి తబ్బిబ్బవుతున్నాడు ఆమె తండ్రి జగన్నాథం.

పాత కాలంనాటి తల్లి పట్టుచీర, నగలు ధరించి అందంగా అలంకరించుకొని బుట్టబొమ్మలా వుంది అన్నపూర్ణ. అంతకుముందు అలాంటి అలంకరణలు రెండు మూడు మార్లుగా అనుభవమే ఆమెకు. ఏదో నేరం చేసినట్టుగా వెళ్ళి పదిమంది ముందూ కూర్చోవాలి. అందరూ తనని బొమ్మని చూసినట్టు చూస్తారు....అర్థమైన ప్రశ్నలూ వేస్తారు. వాటన్నింటికి సహనంగా సమాధానాలు చెప్పాలి.

ఈ మారు వచ్చిన పెళ్ళికొడుకు పేరు విశ్వనాథమని, మంచివాడని, పట్నంలో సర్కారు గుమస్తాగా పని చేస్తున్నాడని వినికిడి....

వచ్చినవారు వద్దంటూనే కాఫీ ఫలహారాలు ముగించారు.

"అమ్మా అమ్మాయిని త్వరగా తీసుకురండి.... మళ్ళీ వర్జ్యం వచ్చేస్తుంది...." తల్లి ఊతనివ్వగా మరబొమ్మలా నడుస్తూ వచ్చి చాపమీద కూర్చుంది అన్నపూర్ణ.....ప్రశ్నలు మొదలయ్యాయి. పాట పాడమన్నారు. గొస్తు విడిచి పాడింది.

"అబ్బాయినొకమారు చూడమ్మా." అన్నారు చూసింది.... అతను నిండుగా కుర్చీలో కూర్చొని క్రీగంట ఆమెను చూస్తున్నాడు. ఆ చూపుల్లో తనపట్ల యిష్టం కానవచ్చింది అన్నపూర్ణకి.... అదే నిజమయితే తన కన్నె చెర విడుతుంది....తండ్రి ఎదమీద కుంపటి దిగుతుంది.... విశ్వనాథం, అతని తలిదండ్రులు వీధి వరండాలోకి వెళ్ళి చెవులు కొరుక్కున్నారు. ఇక తన అవసరం లేదని లోనికి వచ్చేసింది అన్నపూర్ణ....

"అమ్మాయి మాకు నచ్చింది...." అన్నాడు విశ్వనాథం తండ్రి.

"శుభం...." అన్నారు.

"ఆఁ ఇక మిగిలిన విషయాలు మాట్లాడుకుంటే.... ముహూర్తాలు పెట్టుకోవచ్చు."

"చెప్పండి....సందేహిస్తారెందుకు?" అన్నారు.

"మా అబ్బాయికి పాతిక వేలిస్తామని యిప్పటికే రెండు సంబంధాలు వచ్చాయి.... అయితే వాటిని మావాడిష్టపడలేదు..." అంటున్నాడు విశ్వనాథం తండ్రి...."

జగన్నాథం గుండెలదిరాయి...

"అమ్మాయి నచ్చింది కాబట్టి... యిరవై వేలు కట్నంగా యివ్వండి... ఆపైన అత్తగారి లాంఛనాలు... వగైరాలు మీకు తెలియనివికావు..."గుండెను అరచేత పట్టుకుని అభ్యర్థన నిండిన స్వరంతో అన్నాడు జగన్నాథం.

"అంతిచ్చుకోలేము...నాకున్న ఆస్తి ఈ యిల్లొక్కటే... స్కూలు మాష్టరుగా నా సంపాదన మీకు తెలియంది కాదు... ఈ యిల్లు అమ్మగా వచ్చిన పదివేలు కట్నంగా యివ్వగలను... నా మాట. కాదనకండి..." వేడుకున్నాడు జగన్నాథం...

పదివేలా?! పదరా విశ్వం... బండి తప్పిపోతుంది మళ్ళీ..." లేచాడాయన విశ్వం చెయ్యి పట్టుకొని...

"ఒక్క క్షణం ఆలోచించండి బాబూ... నా స్థితిగతులు చూసయినా... కనీసం అమ్మాయిముఖం చూసయినా... అతని మాటలకి కసాయి గుండె కరుగుతుందేమోకాని... విశ్వనాథం తండ్రి బండ గుండె కరగలేదు. వారు నిర్దయగా వెళ్ళిపోయారు...

"దీనికి జన్మలో పెళ్ళికాదు..." తీరని వ్యధకి గురయ్యాడు జగన్నాథం... ఆ వ్యధ అతన్ని మంచమెక్కించింది... ఆనాటి సంఘటన ఏనాటికీ మరచిపోలేనిదిగా మారింది అన్నపూర్ణ జీవితంలో...

* * *

"మీ పేరు అన్నపూర్ణ కదూ?"

విశ్వనాథం గుండెల్లో తుఫాను మొదలయింది... నాటి సంఘటనకి బదులుగా ఈమె సంబంధం కాదంటుందేమో...? పోనీ గొంతెమ్మ కోర్కెలుగా కట్నకానుకలు కోరితే యిచ్చుకునే స్థి

స్థితిలో లేదు తను... తమ యాచనకి వచ్చిన బిచ్చగాడిలా అన్నపూర్ణ ముందు వున్నాడు... పోసి వెళ్ళి ప్రసక్తి తీసుకురాకుండా వెళ్ళిపోతే... అహం తలెత్తింది... అమ్మాయి జీవితం కళ్ళముందు మెదిలింది... కక్కలేక మింగలేక సతమతమవుతున్నాడు విశ్వనాథం.

"మీరు వచ్చిన పని అబ్బాయి ముందుగానే చెప్పాడు... నా నిర్ణయం మా అబ్బాయి నిర్ణయమే... వాడికిష్టమయిన సంబంధం కాబట్టి ముహూర్తాలు పెట్టించండి... అన్నపూర్ణ మాటలు అతన్ని దిగ్భ్రాంతికి గురి చేసాయి.. నిజాన్ని నమ్మలేక పోతున్నాడు విశ్వనాథం.


"అదేమిటి?!, మీరు అమ్మాయిని చూడకుండానే????? కట్న కానుకలు మాట్లాడుకోకుండానే ??????

"డబ్బుతోనే లేదిలోకం విశ్వనాథం గారూ... డబ్బుకోసం ఓ ప్రేమికుల జంటని విడతీసే తత్వంకాదు నాది..." చెప్పుదెబ్బ తగిలినట్టయింది విశ్వనాథానికి... అవును అనాడు తండ్రిని తను ఎదిరించగలిగితే ఆమె తనకు దక్కేది... కృతజ్ఞత నిండిన కళ్ళతో ఆమెను చూస్తున్నాడు విశ్వనాథం... విశ్వనాథానికి బిచ్చం వేస్తున్న అన్నపూర్ణలా వుందామె...

"వస్తానమ్మగారూ..." అహాన్ని చంపుకుంటూ అన్నాడు విశ్వనాథం...

"అదేమిటి కాఫీ త్రాగకుండా వెడుతున్నారు...?" కాఫీ కప్పు అందుకున్నాడు విశ్వనాథం తప్పనిసరిగా..."

* * *







బొమ్మైనా లేదా బొరుసైనా
ఎప్పుడూ గెలుపు మీదే...



ఎల్ ఐ సి నుండి అద్వితీయమైన ప్యాకేజికానుక

# భీమా సందేశ్ + జీవన్ ధారా



మీరు 30 సంవత్సరముల వయస్సు నుండి నెలకు రూ. 181/- చొప్పున ప్రక్కన వుంచి ఒక లక్షరూపాయలకి జీవిత భీమా చేసుకోవచ్చుని, మరియు మీ వయస్సు 55 సంవత్సరములు దాటిన తదుపరి మీ జీవితకాలమంతా రూ.1000/- చొప్పున నెలసరి పింఛను పొందగలరని మీకు తెలుసా?

ఇది ఎల్ ఐ సి వారి ఒక అపూర్వమైన ప్యాకేజికానుక— సులభమైనది మరి అధిక వ్యయములేనిది. యువ్వనులకు, మధ్య వయస్సుకలవారికిది ఎంతో ఆదర్శమైనది.

**భీమా సందేశ్— తక్కువ ప్రీమియంతో, ఎక్కువ భద్రతగల పథకం.**

మీరు తక్కువ ప్రీమియం చెల్లిస్తూ ఎక్కువ భద్రతగల జీవిత భీమా పొందగలరు. నిర్ణీతకాలం వరకూ మీరు జీవించివుంటే, ప్రీమియంలు అన్నీ తిరిగి చెల్లించబడతాయి. పాలసీ యొక్క నిర్ణీతకాలం ముగియక ముందే మరణిస్తే నిశ్చయించిన సొమ్ముమొత్తం మీ నామినీకి చెల్లిస్తారు. ఈ పథకంలో సంవత్సరమునకు లేదా అర్థ సంవత్సరమున కొకసారే ప్రీమియం చెల్లించాలి.

**జీవన్ ధారా— వాలంటరీ పింఛను పథకం**

మీరు రిటైర్ అయిన తర్వాత నెలసరి ఆదాయం పొందుటకు ఇప్పుడునుండే మీ ఇష్టమొచ్చినట్లు కొంతకాలం క్రమంగా ఈ పథకంలో ఆదా చేయండి. ఈ పింఛను మీ జీవితకాలమంతా లభిస్తుంది. పింఛనుదారు జి ఐ వి యు (గ్రాస్ ఇన్సూరెన్స్ వేల్యూ ఎలిమెంట్) మొదలు పెట్టిన తర్వాత మరణిస్తే వారి నామినీకి చెల్లించ బడుతుంది. ఈ జీవన్ ధారాలో బోనస్ రెండుసార్లు కలుపుతారు. మొదటి పింఛను మొదలైనప్పుడు మరి రెండుసారి పింఛనుదారు మరణించిన తర్వాత నామినీకి జి ఐ వి యు చెల్లించేటప్పుడు.

ఎంచుకొన్న నిర్ణీతకాలముల రేట్లు & వయస్సు ఈ క్రింద నివ్వబడినాయి

భీమా సందేశ్ (నిశ్చయించిన సొమ్ము రూ. 1 లక్ష)

| వయస్సు | నిర్ణీత-కాలము | సంవత్సర-మునకు ప్రీమియం రూ. | నిర్ణీతకాలము ముగిసిన తర్వాత బ్రతికివుంటే తిరిగి చెల్లించే ప్రీమియం రూ. |
|---|---|---|---|
| 25 | 25 | 871.70 | 21,793.00 |
| 30 | 25 | 1,078.60 | 26,965.00 |
| 35 | 25 | 1,408.60 | 35,215.00 |
| 40 | 25 | 1,906.00 | 47,650.00 |

జీవన్ ధారా

| లక్ష్య-పెట్టు నిర్ణీత-కాలము | పింఛను మొదలై-నప్పటికి వయస్సు | సంవత్సర-మునకు ప్రీమియం రూ. | నెలసరి పింఛను రూ. | జి ఐ వి యు రూ. |
|---|---|---|---|---|
| 25 | 50 | 1,098.60 | 1,000.00 | 1,19,701.00 |
| 25 | 55 | 1,090.10 | 1,000.00 | 1,19,641.00 |
| 25 | 60 | 1,089.50 | 1,000.00 | 1,19,581.00 |
| 25 | 65 | 1,087.40 | 1,000.00 | 1,19,344.00 |

మిగిలిన వయస్సువారికి రేట్లు, లక్ష్యపెట్టే కాలము మీ అవసరతలకు అనుగుణంగా లెక్క పెడ్తారు.

పన్ను రాయితీలు

సామాన్యంగా భీమా సందేశ్ కిచ్చే 80సి రాయితీలేకాక, 1988-89 సం. లో రూ. 30,000/- వరకూ కట్టిన 'జీవన్ ధారా' ప్రీమియంపై 80సిసిఎ క్రింద 100% ఆదాయపు పన్ను విమోచనము కల్గుతుంది.

ఈ రోజే మీ జీవిత భీమా ఏజెంట్ లేదా దగ్గర్లోవున్న ఎల్ ఐ సి శాఖను సంప్రదించండి.

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

RADEUS/LIC/3.88